అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 11 జనవరి 2023

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు పేదలు, నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం అనేది ప్రాణదానం అవుతుందని గుర్తు చేశారు. జిల్లా ప్రజలు యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ ప్రతినిధులు మహ్మద్ రఫీ, గుర్నూరే రామకృష్ణ, సాయి గౌడ్, మోతిలాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మండలంలోని తిప్పా(జి), తిప్పా(కె), నిశాన్‌ఘాట్, హత్తి గుట్ట, ఆల్లికోరి, మరెగావ్, లోహరా, సాలెగూడ గ్రామాల పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త పసుపు రాజు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు గ్రామాల నుంచి జిల్లాకు సరైన రోడ్డు సౌకర్యం లేనందున సకాలంలో వాహనాలు దొరకక అక్కడి ప్రజలు వైద్యానికి దూరమై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అక్కడి ప్రజల దుస్థితిని దృష్టిలో ఉంచుకొని బోరింగ్ గూడలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సాయి వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు దెబ్బడి అశోక్ సాయి ఉన్నారు.

ప్రజాపంపిణీ రద్దు సరికాదు



నవతెలంగాణ-జన్నారం

దేశంలో సబ్సిడీ బియ్యాన్ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడం అంటే నిరుపేదలు జీవించే హక్కును హరించడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనికరపు అశోక్ అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం తహసీల్దార్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రద్దు చేస్తుందని, దీనిని వెంటనే రద్దు చేసుకోవాలని పేర్కొన్నారు. సబ్సిడీ బియ్యం రద్దు చేయడం అనేది జరుగుతే రేషన్ కార్డు ఆధారంగా బతుకుతున్న కోట్లాదిమంది నిరుపేదల కుటుంబాలను ఆత్మహత్యల వైపు పురికొల్పే ప్రమాదం ఉందన్నారు. రేషన్ షాపుల ఆధారంగా ఉపాధి పొందుతున్న అనేకమంది డీలర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని, రైతుల నుండి వరి ధాన్యాన్ని సేకరించే బాధ్యత ఎఫ్‌సీఐ గోడౌన్ల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రమాదం ఉంది. దేశంలో ఆహార సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉందని తెలియపరిచారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం దేశంలో సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేసే కార్యక్రమాన్ని రద్దు చేసుకొని, కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా 14 రకాల నిత్యావసర సరుకులను తెలంగాణ ప్రభుత్వం అందించడానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ డిమాండ్ చేస్తున్నామని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వాళ్లందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, పాత రేషన్ కార్డులలో పేర్లు మార్పులు, చేర్పులు చేసుకుని అవకాశం మీ సేవలో నిరంతరం కొనసాగించాలని, ఎప్పుడైనా రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకునే అవకాశం ఉండాలని తహసీల్దార్‌కు విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేసే కార్యక్రమం రద్దు చేసుకోకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీ పరీక్షల్లో మరో 17 మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో రాష్ట్రంలో మరో 21 మంది డిబార్ అయినట్టు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డా.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఉమ్మడి జిల్లా నుండి 17 మంది ఉన్నారు. మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ చెన్నూర్ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఇచ్చోడ ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, బోథ్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నేరడిగొండ సాయి చైతన్య డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖ శ్యాం డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్ ఎస్ఆర్ కళాశాలలో ఒకరు చొప్పున డీబార్ అయినట్లు తెలిపారు. ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ముక్త సాల్వే గ్రామ అధ్యక్షుడి ఆకస్మిక మృతి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన దళిత నాయకుడు ఇరాలే అశోక్(50) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామానికి జిల్లాకు ముక్తా సాల్వే అధ్యక్షుడిగా అటు అన్నా భావు సాఠే జిల్లా కమిటీ సభ్యునిగా కొనసాగారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న అన్నా భావు సాఠే జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి పరామర్శించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. వారి వెంట నాయకులు సూర్యవంశీ, పండరి ఉన్నారు.

ఆర్జీయూకేటీలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో మంగళవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ డైరెక్టర్ సతీష్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టిన పనులను, విద్య పరంగా చేపట్టిన మార్పుల గూర్చి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులకు అన్ని విభాగాలు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

వేయికిపైగా గడ్డి కట్టలతో పేర్చిన గడ్డివాము దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతు ఇప్ప రవీందర్‌రెడ్డి మండల కార్యాలయం పక్కన గల వ్యవసాయ భూమిలో గేదెల మేత కొరకు గడ్డి కట్టలు పేర్చి ఉంచాడు. అక్కడి నుండే ప్రతిరోజు అవసరమైన గడ్డి కట్టలు గేదెల మేత నిమిత్తం తీసుకెళ్లేవారు. ఆగంతకులు మంగళవారం ఆప్రదేశంలో మద్యం వెళ్లి అక్కడ సిగరెట్ పడివేయడంతో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పు అంటుకొని ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై గంగాధర్, తహసీల్దార్ కరీం అగ్నిమాపక యంత్రానికి సమాచారం అందించారు. చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి వేశారు. గడ్డి కట్టల విలువ సుమారు ఒక లక్ష యాభై వేల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతులు గడ్డివాముల దగ్గర తగు చర్యలు తీసుకొని జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

కేజ్వీల్ ట్రాక్టర్‌లు రోడ్డు మీదకి వస్తే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎవరైనా కేజ్వీల్ ట్రాక్టర్ తీసుకుని, బీటీ రోడ్డు మీదకి వచ్చిన, రోడ్డులు డామేజ్ చేసిన అట్టి కేజీవీల్ ట్రాక్టర్ డ్రైవర్‌పైన, యజమాని పైనచట్ట రీత్య చర్యలు తీసుకుని, వాహనాన్ని జప్తు కూడా చేస్తామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని తెలిపారు. మండల కేంద్రం నుంచి కంజర్ వెళ్లే మార్గంలో కేజ్వీల్ ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆలయంలో హుండీల లెక్కింపు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో మంగళవారం భక్తులు సమర్పించిన ఒడిబియ్యం హుండీలను లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో ఒడి బియ్యం 50.13 క్వింటాలు, ఎండు కొబ్బరి 273 కిలోలు, బరడి పోకలు 26 కిలోలు, పసుపు కొమ్ములు 54కిలోలు, బాదం 19 కిలోలు, ఖర్జూర పండ్లు 30 కిలోలు వచ్చాయని తెలిపారు. లెక్కింపులో వాగ్దేవి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర గ్రామానికి చెందిన శివ తన ద్విచక్ర వాహనంపై బైంసా నుండి బాసర వైపు వెళుతుండగా మహారాష్ట్రకు చెందిన సక్‌సేనా విట్టోలి తండా నుంచి బైంసా వైపు వెళుతుండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. అయితే శివ, సక్‌సేనాలకు గాయాలయ్యాయి. ఇరువురుని108 వాహనంలో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జిల్లా ఎస్పీని కలిసిన అమన్ ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్ : జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని అమన్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సోషల్ ప్రోగ్రెస్ ఇండెక్స్ ఎకనామిక్ అడ్వైజర్ కౌన్సిల్ టు ద ప్రైమ్ మినిస్టర్ ఇచ్చిన నివేదికలో ఆదిలాబాద్ జిల్లాకు భద్రత పరంగా ఐదో స్థానం లభించినందుకుగాను శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు జ్ఞాపకను అందజేశారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇండెక్స్‌లో కూడా జిల్లాకు అవార్డు లభించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీని కలిసిన వారిలో అమన్ ఫౌండేషన్ సభ్యులు పరమేశ్వర్, కలీం, అజీమ్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం రౌటసంకపల్లి, తిర్యాణి మండలం గిన్నెధరి గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో స్టార్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ జిల్లాలోని రెండు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు ఆత్రం సక్కు, సంస్థ ప్రతినిధులతో కలిసి మండల ప్రజా పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల సమాఖ్య సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టార్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వారు రూ.25 లక్షలతో రెండు గ్రామాలలో విద్య, వైద్యం, జీవ పరిమాణాలపై ఖర్చు చేసి అభివృద్ధికి సహకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రౌటసంకపల్లి, గిన్నెధరి చారిత్రాత్మక గ్రామాలని, వీటిని అభివృద్ధి పథంలో ముందుంచి దేశంలోనే గుర్తింపు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా సంస్థ ముందుకు రావడం అభినందనీయమని, మహిళా సంఘాలు, ఐకేపీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసే ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం నుంచి సీఎస్ఆర్ కార్యక్రమాలపై దృష్టి సారించడం జరిగిందని, దాదాపు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచీలు అందజేయడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆశ్రమ పాఠశాలలు, గిన్నెధరి గ్రామంలో స్టడీ సెంటర్, కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాలకు చిన్న కాంట్రాక్టులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వారి పనితీరును పరిశీలించి ఉత్తమ సేవలు అందించిన వారికి భవిష్యత్తులో పెద్ద కాంట్రాక్టులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, స్టార్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వైస్ చైర్మన్ సుభాష్ చంద్ర, సీనియర్ మేనేజర్ అభినవ్, ఆసిఫాబాద్, తిర్యాణి మండల ప్రజా పరిషత్ సభ్యులు మల్లికార్జున్, శ్రీదేవి, సర్పంచ్ లు, ఎం.పి.టి.సి.లు, మహిళా సమాఖ్య సభ్యులు, ఐ.కె.పి. సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూలో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డుల చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులు మంగళవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ కార్మికులకు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వేతన సవరణ జీఓలను విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రయివేటు కంపెనీల యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం బానిసగా వ్యవహరిస్తూ అందులో పని చేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. జీఓలను సవరిస్తే ప్రభుత్వ ఖజానాకు రూపాయి కూడా ఖర్చు ఉండదని కార్మికుల వేతనాలు పెరుగుతాయని అన్నారు.ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులకు వేతన సవరణ జీఓ 21ను విడుదల చేసినా గెజిట్ చేయలేదని అన్నారు. వెంటనే జీఓ 21ను గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు కల్పించాలని, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగన్న, ప్రయివేట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ నాయకులు ప్రసాద్, తిరుపతి, రాకేష్, రాజేశ్వర్, ఆశన్న, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ-బోథ్

ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ, డీసీసీ ఆదేశానుసారంగా రాహుల్ గాంధీ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈనెల 26న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క చేపడుతున్న పాదయాత్రను నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, జెండా ఎగరవేయాలని అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధినీ కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయేలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ నాయకుడు మల్లేష్, మండల కన్వీనర్ కుర్మే మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, పట్టణ అధ్యక్షుడు సల్లా రవి, నాయకులు జక్కబాపు రెడ్డి, గడ్డం సురేందర్, గుడాల శేఖర్, రాజశేఖర్, ఉమేష్ పాల్గొన్నారు.

బీసీల సమస్యల సాధనకు బైక్ ర్యాలీ

నవతెలంగాణ-జన్నారం

బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కోకన్వీనర్ కాసెట్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిషన్కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితులకు ఇస్తున్న దళిత బంధు పథకం లాగే బీసీలకు కూడా బీసీ బంధు పథకం ఇవ్వాలన్నారు. ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షల అందించి పేద బీసీ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పథకం విఫలమైనందున సొంత స్థలాలలో ఇల్లు నిర్మించుకున్న వారికి రూ.3 లక్షల ఇస్తామంటున్నారని, ఇవి సరిపోవు కాబట్టి రూ.10 లక్షల ప్రతి ఇంటికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభలైన అసెంబ్లీ పార్లమెంట్లలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేయాలన్నారు. బీసీ కులాల వారికి జనగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కె.నర్సింహులు, ఆడెపు లక్ష్మీనారాయణ, మూల భాస్కర్ గౌడ్, శ్రీరాముల గంగాధర్, చెడిపల్లి గంగయ్య, మామిడి విజయ్ కులి పెల్లి రమేష్, కొత్తపల్లి రమేష్, మోహన్ పాల్గొన్నారు.



11వ వేతన ఒప్పందం విషయంలో విమర్శలు తగవు : సీఐటీయూ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కొందరు టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల సమస్యలు పరిష్కరించక 11వ వేతన ఒప్పందంలో వేతన పెరుగుదల హామీలపై జాతీయ సంఘాలను విమర్శించడం సరికాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ అన్నారు. మంగళవారం కేకే5 గని మీద జడల ప్రవీణ్ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ వేతన ఒప్పందంలోని కనీస వేతన పెరుగుదలపై విమర్శించే కొందరు టీబీజీకేఎస్ నాయకులు అలవెన్స్‌లపై ఐటి మాఫీ, వెటర్నిటీ, లీవు వంటివి అధికారులకు అమలు చేస్తుంటే కార్మికులకు ఎందుకు ఇప్పించలేకపోతున్నారో వారు చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని యూనియన్లుగా ఆర్ఎల్సి వద్ద చేసిన అగ్రిమెంట్లను ప్రభుత్వం అనుబంధంగా కొనసాగుతూ సింగరేణిలో ఎందుకు సర్క్యులర్లు ఇప్పించలేకపోతున్నారో తెలపాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వం బొగ్గు పరిశ్రమపై కన్నేసి కొత్త బ్లాకులను వేలం వేస్తుంటే పార్లమెంట్‌లో ఎంపీలు ఎవరు అడ్డుకోలేదని కనీసం తెలంగాణ తరఫునైనా బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపాలని డిమాండ్ చేశారు. గెలిచిన సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా ఉండడం వల్ల నేడు కార్మికులకు ఉత్పత్తి నెలల్లో రావలసిన స్పెషల్ ఇన్సెంటివ్ ఆపివేసిందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఫిట్ సెక్రటరీ ఎస్.వెంకటేష్, జె. వెంకటేష్, వి.శివ, చైతన్య రెడ్డి, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

కలమడుగు గోదావరికి చేరుకున్న మెస్రం వంశీయులు



నవతెలంగాణ-జన్నారం

కేస్లాపూర్ నాగోబా జాతరకు సంబంధించి పవిత్ర గోదావరి జలాలను సేకరించేందుకు మెస్రం వంశీయులు మంగళవారం మండలంలోని కలమడుగు గ్రామ శివారులో గోదావరి నదికి చేరుకున్నారు. గోదావరి జలాల కోసం పది రోజులుగా వారు పాదయాత్ర చేస్తూ మంగళవారం ఉదయం కలమడుగు గోదావరి నది తీరానికి చేరుకున్నారు. అక్కడ గోదావరికి ప్రత్యేక పూజలు చేసి, పుణ్యస్నానాలు ఆచరించి, వారు గోదావరి నుంచి స్వీకరించిన జలానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 21న జరగబోయే నాగోబా మహాఅభిషేకం కోసం గంగ జలాన్ని తీసుకెళ్లడానికి వచ్చినట్లు కులపెద్దలు వివరించారు.

గిరిజన భవనం ప్రారంభానికి మంత్రి రాక

నవతెలంగాణ-ఖానాపూర్

మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో గల గిరిజన భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం రానున్నట్టు బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు రాజ్ గంగన్న, తూము చరణ్, పట్టణ అధ్యక్షులు పరిమి సురేష్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే రేఖ నాయక్ భవనాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగుపైన మంత్రి అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ వైస్‌చైర్మెన్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రయివేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ట్రాస్మ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సబ్జెక్టుల వారిగా ప్రత్యేక శిక్షణ తరగతులు చేపట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. వచ్చేనెల ఫిబ్రవరిలో మండల, జిల్లా, స్పోర్ట్స్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా త్వరలో ట్రాస్మ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క పాఠశాల కరస్పాండెంట్లు రాష్ట్ర, జిల్లాస్థాయి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహ కార్యవర్గ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా జనరల్ సెక్రటరీ పడాల ప్రభాకర్, మండల గౌరవ అధ్యక్షులు ఏనుగు సతీష్ రెడ్డి, మండల అధ్యక్షులు పుప్పాల మల్లేష్, మండల కార్యదర్శి విద్యులత, మండల ఉపాధ్యక్షులు తుమ్మనపల్లి సాంకేతవర్ధన్, మండల కోశాధికారి గాజుల రాజన్న, కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్, స్వామి, ప్రవీణ్, గంగాధర్, సతీష్ బాబు ఉన్నారు.

13 నుంచి పెందూర్ జంగు పటేల్ స్మారక కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 13 నుంచి పెందూర్ జంగు పటేల్ కబడ్డీ 23వ స్మారక పోటీలు నిర్వహించ నున్నట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్ రావు ఒక ప్రకటనలో పర్కొన్నారు. బాబా యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ జట్టు వివరాలను రూ.251 చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ భహుమతిగా రూ.7777 నగదు, ద్వితీయ బహుమతిగా రూ.4444 నగదు, తృతీయ బహుమతిగా రూ.2222 నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8186829503, 9666322124 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రగతి విద్యాలయంలో సందడిగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంక్రాంతి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే రంగవల్లుల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థినులు తమ నైపుణ్యాలను కనబరిచేందుకు ఈ పోటీలు దోహదం చేస్తున్నాయి. అందులో భాగంగానే ఆదిలాబాద్ పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీలు సందడిగా కొనసాగాయి. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. పండుగ ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా పలువురు విద్యార్థినులు ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించి, విజేతలను ప్రకటించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బయో మైనింగ్ ప్రాజెక్ట్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- అదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ చేసే డంపింగ్ యార్డ్ లో బయో మైనింగ్ ప్రాజెక్టు ద్వారా చేపట్టే శుద్ధీకరణ పనులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం ప్రారంభించారు. అనుకుంట బంగారుగూడ నాలుగో వార్డులో కాలనీలోని డంపింగ్ యార్డ్‌లో రూ.10 కోట్లతో చేపట్టే బయో మైనింగ్ ప్రాజెక్టు పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ లో చేపడుతున్న వివిధ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, వైస్ చైర్మన్ షేక్ రంజాన్, వార్డ్ కౌన్సిలర్లు బండారు సతీష్, బిఆర్ఎస్ నాయకులు మంచాల పెద్ద మల్లయ్య, సోమన్న, బంగారు గూడ కాలనీవాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కంటి వెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి నరేందర్ మాట్లాడుతూ జనవరి 18 తేదీ నుండి కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం ప్రారంభం కాబోతున్నందున మండలంలోని కంటికి సంబంధించిన వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వెంటనే వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మొదటగా వయస్సు పైబడిన వారిని గుర్తించాలని, కార్మికులతో పాటు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించాలని కోరారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామానికి సైతం కంటి వెలుగు పై సమాచారం తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీధర్, హరీష్, వంశీకృష్ణ, రాహుల్ వైద్య సిబ్బంది ఉన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ- బేల

పత్తికి తగిన గిట్టుబాటు ధర కోసం ఈ నెల 12న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో కదిలిరావాలని అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిపంటకు కేంద్రప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో గిట్టుబాటు ధరలు నిరయించడం లేదని తెలిపారు. ప్రతి సంవత్సరం రైతులకు సాగు పెట్టుబడి పెరుగుతున్నదని కానీ అందుకు తగినవిధంగా రైతుకు గిట్టుబాటు ధరలు నిర్ణయించడంలో లోపముందని వివరించారు. సీసీఐ బహిరంగ మార్కెట్‌లో కమర్షియల్ పద్ధతిలో కొనుగోలు చేయడం ద్వారా రైతులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి,విజ్జగిరి నారాయణ,గోవర్ధన్ యాదవ్, చిలుక దేవిదాస్, సామ రుపేష్‌రెడ్డి,కేమ లక్ష్మణ్,మాజీ జడ్పిటిసి రాందాస్ నాక్లే, బేల మండల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ గుండావార్,బేల మండలం మాజీ మార్కెట్ చైర్మన్ వామన్‌రావు పాల్గొన్నారు.

యాసంగి పంట పొలాలకు నీరు విడుదల



నవతెలంగాణ- కడెం

కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా కడెం ఆయకట్టు యాసంగి పంట పొలాలకు మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమం కోసం కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాట్ టెస్ట్ మ్యాచ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, క్యాట్ వారు చేస్తున్న కషి అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం బెల్లూరి గ్రౌండ్లో క్యాట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన త్రీ డేస్ స్కూల్ టెస్ట్ మ్యాచ నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, క్యాట్ అధ్యక్షులు సునీల్ బాబు, క్యాట్ జిల్లా కార్యదర్శి రంగినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ పార్టీ



నవతెలంగాణ- ఇచ్చోడ

గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా గతంలో చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున యాత్రకు సంఘీభావంగా ప్రతి బూతులో పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షల రుణమాఫీ ఎకరానికి పదిహేను వేల రైతుబంధు, కౌలు రైతులకు రైతుబంధు, కూలీలకు సంవత్సరానికి రూ.12వేలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, బోథ్ నియోజకవర్గ ఎస్సీ చైర్మన్ కొత్తూరు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి భీమన్న, మండల కార్యదర్శ చోలే ప్రభాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పట్ల గోవర్ధన్ పాల్గొన్నారు.

నాగోబా జాతర వేలం రూ.11.18లక్షలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి పొందిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర ఈ నేల 21 నుంచి 28 వరకు కొనసాగనుంది. ఈ జాతర లో వెలిసే వివిధ దుకాణాల కోసం దర్బార్ హాలులో ఉట్నూర్ ఆర్డీఓ కదం సురేష్,తహసీల్దార్ ముంజం సోము,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి రవికుమార్ సమక్షంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఈ జాతరలో వెలిసే తైబజార్ కోసం వివిధ రకాలు దుకాణాల ద్వారా రూ.11.18లక్షల ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు.

సదర్ మాట్ నీటి విడుదలలో జాప్యం

● దాటిపోతున్న రబీసాగు సమయం ● ఆందోళనలో అన్నదాత



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సదర్‌మాట్ నీటి విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల ఈసారి రబీ వరిసాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి మొదటి వారంలో పూర్తిస్థాయి మట్టంతో నీరు వదలాల్సి ఉండగా ఇంతవరకు పూర్తి గలుమలకు నీరు వదల్లేదు. దీంతో రబీ సాగు సమయం దాటుతుండటంతో రైతుల్లో అయోమయం నెలకొంది. గడిచిన ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలకు సదర్ మాట్ కెనాల్‌కు గండ్లు పడ్డ సంగతి తెలిసిందే. స్వల్పకాలంలో మరమ్మతులు చేసే అవకాశం ఉన్న గండ్లను ఖరీఫ్ సమయంలోనే పూడ్చేసి సగం ఆయకట్టుకు నీరు వదిలారు. దీంతో 14 వేల ఆయకట్టు ఉన్న సదర్‌మాట్ దిగువన కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే సాగయ్యింది. కొత్తపేట్ సమీపంలోని అండర్ టెన్నల్ (యూటీ) వద్ద పడ్డ గండిని పూడ్చే అవకాశం లేక కొత్తపేట్, బావాపూర్, లింగాపూర్, ఎలగడప, ధర్మాజీపేట్, తదితర గ్రామాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాల సేద్యపు భూములకు నీటి పారకం నిలిపేశారు. కారణంగా సదరు గ్రామాల రైతులు ఖరీఫ్ సాగుకు నోచుకోక సదరు నష్టపోయారు. రబీ పంట సమయానికైనా గండ్ల మరమ్మతులు పూర్తిచేసి సకాలంలో నీరు వదులుతారని రైతులు భావించారు. రైతులు అనుకున్నట్టుగానే గడిచిన డిసెంబర్ 31న అధికారులు సదర్మాట్ నీటిని విడుదల చేశారు. దాంతో ఆయకట్టు రైతులు ఎంతో సంబపడ్డారు. నాసిరకం పనుల వల్ల నీరు వదిలిన మరుసటి రోజునే చైనేజ్ 574 అండర్ టన్నెల్ వద్ద గండ్లు పడి ఇరువైపుల కట్టలు కుంగిపోయాయి. దీంతో ఆయకట్టుకు సాగునీటి సరాఫరాను నిలిపేశారు. తిరిగి గండ్ల మరమ్మతులు పూర్తి చేసి ఈనెల 9న స్వల్ప మట్టంతో కెనాల్‌కు నీరు విడుదల చేశారు. దీంతో పూర్తి స్తాయిలో తూములకు నీరందడంలేదు. ఖానాపూర్ ప్రాంతంలోని తక్కెళ్లతూము, బండకింది గలుమ, దిలావర్ పూర్, గోడలపంపు, తధితర గ్రామాల పొలిమేరల్లోని పలు తూములకు నీరందక రబీ పనులు ముందుకు సాగడం లేదని రైతులు చెబుతున్నారు.

ఆలస్యమైతే పంట చివరలో ఇబ్బందులు

ఈపాటికే ఆలస్యమైన సదర్‌మాట్ నీటి విడుదలలో మరింత జాప్యం జరిగితే పంట చివరి సమయంలో నీటి సమస్య తలెత్తే ప్రమాదం నెలకొంటుందని రైతులు అంటున్నారు. రబీలో స్వల్పకాలిక వరిపంట దిగుబడికి 120 రోజుల సమయం పడుతుంది. సదరు పంటకు కనీసం 115 రోజుల వరకు నీటి తడులు అందించాల్సి ఉంటుంది. గలుమలకు పూర్తిస్తాయిలో నీరందితేనే రైతులందరూ నారుమళ్లను సిద్ధం చేసుకుంటారు. ఈపాటికే ఆలస్యమైన ఖరీఫ్ సాగు పనులు మరింత జాప్యమైతే పంట చివరి సమయంలో ఎండల తీవ్రతకు పంట దెబ్బతినే ప్రమాదం ఉంటుందంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయకట్టుకు ఎలాంటి ఆటంకం లేకుండా అన్ని గలుమలకు నిరంతరంగా సాగు నీరంధించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూర్తిస్తాయిలో నీరు వదలాలి



సదర్ మాట్ కింద తూములన్నిటికి నీరందేలా కెనాల్ లో పూర్తి మట్టంతో నీరు వదలాలి. గడిచిన ఖరీఫ్‌లోనే పంటలు వేసుకోక రైతులు నష్టపోయారు. ఈ రబీలో పంట చివరిదాకా సక్రమంగా నీరంధించి రైతులను ఆదుకోవాలి.

దుర్గం నూతన్ కుమార్
వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

కంటివెలుగును విజయవంతం చేయాలి

● మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి చూపు చాల సున్నితమైనదని, మరొక వ్యక్తిపై ఆధారపడి ఉండాల్సి ఉంటుందని అన్నారు. కంటి సమస్యలు రూపుమాపేందుకు పరీక్షలు నిర్వహించి అవసరమైన కండ్ల అద్దాలు ఉచితంగా తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్నదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుండి 1500 టీమ్‌లతో రూ.250 కోట్ల నిధులతో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుచున్నదని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 33 టీమ్ లను ఏర్పాటు చేసి 100 పనిదినాల్లో కండ్ల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ నెల 12లోగా మండల స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించుకొని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు, దాతల సహకారంతో శిబిరాల వద్ద ఏర్పాట్లకు, గ్రామాల నుండి శిబిరాల వద్దకు రవాణా సౌకర్యానికి సహకరిస్తామని ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. శిబిరాల వద్ద పరీక్షలు నిర్వహించిన అనంతరం డాక్టర్ల సూచనల మేరకు రీడింగ్ కండ్ల అద్దాలు వెంటనే అందజేయడం జరుగుతుందని తెలిపారు. చూపు మందగించిన వారికీ అవసరమైన కండ్ల అద్దాలను ఆయా కంపెనీలు వారంలోగా వారి ఇంటికి పంపించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాసేవలో నిమగ్నం అవుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం ఈ చేయాలనీ ఆకాంక్షించారు. దేశంలోనే ఆదిలాబాద్ జిల్లా సురక్షితమైన జిల్లాగా ఐదో స్థానాన్ని, రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సంపాదించుకోవడం గర్వకారణమని, ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, ఆర్డీఓ రమేష్ రాథోడ్, కంటి వెలుగు నోడల్ అధికారి డా. జాన్‌బాబు, జెడ్పీసీఈఓ గణపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వివేక్ (22) శుక్రవారం ఉదయం సుమారు 3,30గంటలకు ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌ఛార్జి ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మర్రి గంగాధర్-రాధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుటుంబ పోషణ కోసం తండ్రి గల్ఫ్ దేశాల్లో ఉంటున్నారు. కుమారుడు వివేక్‌ను హైదరాబాదులో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వివేక్ ఇంటి వద్దనే ఉంటున్నట్లు చెప్పారు. కాగా శుక్రవారం ఉదయం 3.30గంటల ప్రాంతంలో తల్లి రాధా నిద్ర లేచి చూడగా కుమారుడు చీరతో ఉరివేసుకొని కనిపించడంతో కాలనీవాసులను పిలిచి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఇంఛార్జి ఎస్సై పరిశీలించగా ఏఎస్ఐ రామచందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు ముందు ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లాలో చలి తీవ్రత దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని ఆధ్వర్యంలో రిమ్స్ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. సుమారు 200 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం తరపున చేపట్టే కార్యక్రమాలకు దాతలు సైతం తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, బండారి సతీష్, కో ఆప్షన్ మెంబర్ ఏజాజ్, నాయకులు మహమ్మద్ షబాజ్, మోసిన్ ఉన్నారు.

రోడ్లపై కేజ్వీల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



రోడ్లపై కేజ్వీల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లు పాడవకుండా కేజ్వీల్లను ట్రాక్టర్ ట్రాలీలలో మాత్రమే తీసుకుపోవాలని తెలియజేశారు. ట్రాక్టర్ చక్రాలకు పట్టీలు ఏర్పాటు చేయకుండా కేజ్వీల్ ట్రాక్టర్లు రోడ్లపై తిప్పితే రోడ్లు ధ్వంసం అవుతాయని తెలిపారు. ట్రాక్టర్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. టీఎస్18 బి 0472 నెంబరు గల కేజ్వీల్ ట్రాక్టర్‌ను బీటీ రోడ్డుపై తిప్పడంతో గుండంపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని మేకల చిన్నయ్యపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

ఎస్పీని కలిసిన టూర్స్ అండ్ ట్రావెల్స్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిశారు. ప్రజల భద్రత అంశంలో ఆదిలాబాద్ పట్టణం దేశంలోనే 5వ స్థానం, తెలంగాణలో మొదటి స్థానంలో నిలిచిందని ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక సందర్భంగా ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను సైతం ఎస్పీ తో చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి షౌఖత్ ఉస్సేన్, కోశాధికారి సుభాష్ ఉరాడే ఉపదక్షులు షేక్ మహబూబ్ పాషా, అభు బక్కర్ బిన్ అఫీస్, బారడీ రాకేష్, సాదక్ అలీ పాల్గొన్నారు.

నాసిరకం రోడ్డు పనులు..!

● పట్టించుకోని ఐటీడీఏ అధికారులు



నవతెలంగాణ- ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ఈ నెల 21న ప్రారంభం కానుంది. ఈ జాతరకు వెళ్ళే రహదారి ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు సుమారు 3 కి.మీ.వరకు బిటి రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలమయంగ మారింది. ఈ రోడ్డుకు మరమ్మత్తు పనులకు ఉన్నతాధికారులు ఆదేశించడంతో గత రెండు రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను పర్యవేక్షించే ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో గుత్తేదారే ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. గంతలు ఏర్పడి కంకర లేచిన చోట ప్యాచ్ వర్క్ పనులు కొనసాగుతున్నాయి. ఈ గంతలలో తీసిన కంకర స్థానంలో కంకర, చిప్స్ సరైన పాళ్లలో వేయకపోవడంతో అది మున్నాళ్ల ముచ్చటగానే మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాసిరకం పనులు జరుగుతున్నా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇదే రోడ్డులో గతంలో రూ.1.80కోట్లతో డబుల్ బీటీ రోడ్డు నాసిరకం పనులు చేయడంతో అనతికాలంలోనే శిథిలావస్థకు చేరుకుంది. తాజాగా నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు సైతం అదే పరిస్థితిని తలపించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన యువజన సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానం ఎదుట స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఈనెల 12న యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా, పట్టణ యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు బాలశంకర్ కృష్ణ, ఉరే గణేష్ తెలిపారు. ఈ విషయమై జిల్లా సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి లను మంగళవారం వేరువేరుగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుని చిత్రపటాన్ని బహుకరించారు. ప్రతినిధులు శ్రీపతివార్ శ్రీనివాస్, విన్ రెడ్డి, బ్రమ్మ రైతు గణేష్, పసుపుల రాజు, అల్తాఫ్ ఖాన్, ఖలీం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా మవాల మండల కేంద్రంలో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి మంగళవారం జడ్పీటీసీ నల్ల వనిత భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.39 లక్షలతో ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.అదే విధంగా ఉన్నత పాఠశాలలో రూ.68 లక్షలతో అదనపు గదులతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న కృషితో మండలం అన్ని రకాలుగా అభివద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్తులో మండలాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మవాల సర్పంచ్ దొగ్గలి ప్రమీల రాజేశ్వర్, నాయకులు నల్ల రాజేశ్వర్,దర్శనాల ఏవన్, ఉమాకాంత్‌రెడ్డి, సుదీర్, విజయ్,గంగన్న,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా ఏర్పాట్లు



నవతెలంగాణ- ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో విద్యుత్ శాఖ చేపడుతున్న పనులను ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ పరిశీలించారు.గత వారం రోజుల నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది జాతర వెలిసే ప్రాంతంలో నూతన స్తంభాలు ఏర్పాటుచేయడం అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చారు. తాగునీటి బోర్‌వెల్‌లకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జాతర ప్రాంగణంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా 24 గంటలు విద్యుత్ పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక ఏఈ రాథోడ్ రోహిదాస్ తదితరులున్నారు.

సీఎంఆర్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలానికి చెందిన 9మంది లబ్ధిదారులకు మంగళవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మునుపెన్నడు లేని విధంగా ప్రజలు ఆనందంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కష్ట కాలంలో ముందు ఉండి ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, లింగారెడ్డి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి జాతరను విజయవంతం చేయండి

నవతెలంగాణ-జైనూర్

కొత్తపల్లి గ్రామంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే జాతరను విజయవంతం చేయాలని గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ దయాకర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కొత్తపల్లి ప్రారంభమయ్యే జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ చేసిన దీక్షభూమిలో జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కొత్తపల్లి దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆదేశాల మేరకు పోస్టర్లను విడుదల చేశామని తెలిపారు. బంజారా సోదరులు దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలకు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడె సునీల్, సందీప్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తవక్కల్ పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను, ముగ్గుల పోటీలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపు 80 మంది పేరెంట్స్ పాల్గొన్నారు. ఈ పోటీలో పది ముగ్గులను సెలెక్ట్ చేసి ఒక్కొక్కరికి తవక్కల్ యాజమాన్యం రూ.1000 చొప్పున బహుమతి ప్రధానం చేశారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం తవక్కల్ సంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 60 మందికి ఒకరోజు జైలు శిక్ష

- సంచలన తీర్పునిచ్చిన జిల్లా న్యాయస్థానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 60 మందికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ జిల్లా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ ఇన్‌చార్జి జడ్జి యశ్వంత్ సింగ్ చౌహన్ తీర్పును వెలువర్చారు. ఈ సందర్భంగా మంగళవారం వివిధ పోలీస్ స్టేషన్‌లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారిని మంగళవారం జిల్లా కోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో వారికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. ఇందులో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 37 మంది, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11మంది, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 మంది ఉన్నారు. ఎవరైనా తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే మొదటిసారి కావడం విశేషమైంది.

ఇల్లు నిర్మాణానికి సాయం చేసిన జీఎస్ఆర్ ఫౌండేషన్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని సూపర్ బజార్ సాయిబాబా టెంపుల్ వెనకాల ఉన్నటువంటి తుంగ కుమార్ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయి దీన పరిస్థితిలో ఉన్న వారికి మంగళవారం జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజా రమేష్ సాయం చేసారు. వారి ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్ రేకులు, సిమెంట్ పిల్లర్స్, బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పొన్నాల సాగర్, ఆకనపెల్లి సురేష్, బద్రి సతీష్, కిరణ్ కుమార్, ఉపాలపు సురేష్, ప్రకాష్, విత్తనాల రమేష్, తిరుపతి, సతీష్, తాహెర్, మేకల రమేష్, బెల్లం తిరుపతి, మెరుగు రమేష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చితే తమ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల పరుగు పందానికి విశేష స్పందన

నవతెలంగాణ-చింతలమానపల్లి

మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు పందాలకు విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరుగు పందాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. ఎడ్ల పరుగు పందెంలో మొత్తం 22 జతలు పాల్గొనగా, దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన బోయిరే తులసిరాంకు మొదటి స్థానం, ఇట్యాల గ్రామానికి చెందిన భగవత్ కు రెండవ స్థానం లభించగా మొదటి స్థానానికి 5 గ్రాములు, రెండవ స్థానానికి 2.5 గ్రాముల బంగారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, కౌటాల ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, సర్పంచ్ రౌతు సుజాత, ఉప సర్పంచ్ బాగ్య, ఎస్సైలు వెంకటేష్, మనోహర్, ఏఎస్సై యాదవ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కెరమెరి

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం లింగయ్య అన్నారు. మంగళవారం ధనోర ఫిల్టర్ బెడ్ వద్ద మిషన్ భగీరథ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యాథితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జండా ఆవిష్కరించి మాట్లాడారు. ఎల్ అండ్ టి కంపెనీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కారించడంలో కాలయాపన సరైంది కాదని అన్నారు. కార్మికుల సేవలను గుర్తించి వారి శ్రమను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు దండుగుల భీమరాజు, ప్రధాన కార్యదర్శి జాదవ్ శ్రీకాంత్, చరణ్, శాంతోష్, రాందేవ్ పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

నవతెలంగాణ-జైనూర్

నాబార్డు వారి సౌజన్యంతో జైనూర్ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం సిర్పూర్(యు) మండలంలోని సిడాంగూడ గ్రామంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాబార్డు ఎఫ్ఎల్‌సీ రామరెడ్డి మాట్లాడుతూ రుణాల వసూలు, డిజిటల్‌పై ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బ్యాంకులో పొందిన ఖాతాలో రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కొత్త రుణాలు పొందలేని వారు బ్యాంకుకు వచ్చి సంప్రదించాలని తెలిపారు. ఫోన్‌లో ఎలాంటి ఓటీపీలు చెప్పకుండా, పిన్‌కోడ్‌లు చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జైనూర్ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో డిజిటల్‌పై ప్రత్యేక వడ్డీ రేటు 725 రోజుల్లో 7.25 శాతం, ప్రీమియం, సీనియర్ సిటిజన్ 0.50 శాతం అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. బ్యాంకులో గోల్డ్‌లోన్ సౌకర్యం అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. డిపాజిట్లపై రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సీఎం ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ అరవింద్ కిరణ్, సీఈఓ రమేష్, మాజీ సర్పంచ్ నాగోరావు, కుమ్రం గంగారాం పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయి

నవతెలంగాణ-కౌటాల

క్రీడలు మానసికొల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కబడ్డీ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గెలుపోటములు సహజమని, ప్రశాంత వాతావరణంలో క్రీడలు ముగించుకోవాలని యువకులకు సూచించారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని, గ్రామాలు అభివృద్ధి పథంలో నడవడానికి యువత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి బాజీరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు నరులె వానుపటేల్, బండు, మితున్ కవిరాజ్, వడులె ఋషి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నవతెలంగాణ-తాండూర్

మండలంలో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం అయ్యేలా నాయకులు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలోఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే జిల్లా అధికారులు చర్యలు తీసుకునేలా తీర్మానం చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 18 నుండి ప్రభుత్వం చేపట్టబోయే కంటి వెలుగు కార్యక్రమానికి అనుహ్య స్పందన వచ్చేలా నాయకులు అధికారులు కృషి చేయాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్నినాయకులు కార్యకర్తలు గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేయాలన్నారు. మండలంలోని రైతు వేదికలను ఉపయోగించుకొని రైతులతో పరస్పరం సమావేశాలు జరపాలని వ్యవసాయ అధికారి కిరణ్మయి, హార్టికల్చర్ ఆఫీసర్ సుప్రజ లకు సూచించారు. మండలంలో వందరోజుల ప్రణాళిక ప్రకారం 42 హెల్త్ క్యాంపు నిర్వహించామని ప్రభుత్వ వైద్యులు కుమారస్వామి తెలిపారు. కంటి వెలుగు విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని కత్తర్ల గోపాల్ నగర్, అన్నారం గ్రామాల్లో రైతులకు గిరి వికాశ్ పథకం ద్వారా ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు ఏఈ ప్రభాకర్ వివరించారు. కృత్రిమ గర్భాదారణ ద్వారా ముర్ర, ఒంగోలు జాతి పశుసంతతి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పశువైద్యాధికారి భూమయ్య తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరి గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ బానయ్య తహసీల్దార్ కవిత ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం గౌరవ వేతనం పేరుతో ప్రతి నెల రూ. ఒక వేయి ఇస్తున్నప్పటికీ అవి కూడా ఇప్పటివరకు పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం కోడిగుడ్డుకు రూ.5 చెల్లించడం సమంజసం కాదన్నారు. కోడిగుడ్డు మార్కెట్ ధర రూ.6 నుండి 7 వరకు ఉందన్నారు. దీంతో నిర్వాహకులు అదనపు భారాన్ని భరిస్తున్నారని వివరించారు. ఇప్పటి వరకు పెండింగ్లో ఉన్న కోడిగుడ్డు బిల్లులు, జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు.పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.15 మెనూ చార్జీలు పెంచి ఇవ్వాలని, అదే విధంగా దాదాపు 20 ఏళ్ల నుంచి పని చేస్తున్న ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం కాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెరిగిన వేతనం జీఓను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వమే ఉచితంగా కోడిగుడ్డును, వంట గ్యాసను సరఫరా చేసి ప్రతి ఒక్కరికి పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్.శోభ, మండల అధ్యక్షులు రబీయా, కాంతమ్మ లక్ష్మి, కళావతి, ఎల్లమ్మ, రజిత మల్లవ్వ, రాజేశ్వరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడల వల్ల శారీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మూడు రోజులపాటు కొనసాగనున్న సంవత్సరిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి శాంతి కపోతాలు గాలిలోకి వదిలిన తర్వాత పోలీస్ క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజారక్షణకు పోలీసులు నిరంతరం విధుల్లో ఉంటూ, అంకితభావంతో కష్టపడి పని చేస్తున్నారని అన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. పోలీసులు శారీరక ధృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఉపయోగపడుతాయన్నారు. పోలీసుల మానసికోల్లాసం కోసం స్పోర్ట్స్ మీట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆటల్లో గెలుపోటములనేవి సహజమని, జట్టు స్ఫూర్తి గొప్పదన్నారు. క్రీడలు మనలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను, పోరాట పటిమను వెలికితీస్తాయన్నారు. పోలీసులు ఒత్తిడి, అలసటకు లోనవకుండా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం ముఖ్యమన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనైనా, ఏ వృత్తిలోనైనా ఫలితం ఉంటుందన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడంతో పాటు ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. అనంతరం క్రీడాకారులతో షటిల్ ఆడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర రావు, అదనపు ఎస్పీ (ఏఆర్)భీమ్ రావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, నాగేందర్ పాల్గొన్నారు.

ఉన్మాద మూకపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-నస్పూర్

నిజామాబాద్ జిల్లా కోటగిరిలో గణేష్ ఉత్సవాలకు చందా ఇవ్వలేదనే కక్షతో ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన మతోన్మాదా మూకలను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై మతోన్మాద మూకలు దాడులు చేస్తూ, అవమానపర్చడం, బెదిరించడం, తన విధులకు ఆటంకం కల్గించడం హీనమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వ టీచర్‌ను అందరూ చూస్తుండగానే ఇబ్బంది పెడుతుంటే పోలీసులు, విద్యాశాఖ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గు చేటని అన్నారు. తప్పులను ఎత్తి చూపేవారిపైన, నిజాలను మాట్లాడేవారిపైన దాడులు చెయ్యాలని, మాట్లాడకుండా చెయ్యాలని అనుకుంటున్న మతోన్మాద మూకలు గుజరాత్, ఉత్తర ప్రదేశ్‌లో రెచ్చిపోయినట్లు తెలంగాణ రాష్ట్రంలో చెయ్యాలని చూస్తే ఇక్కడి ప్రజలు నిరంకుశవాదులకు ఘోరీకట్టిన చరిత్ర ఉందని హెచ్చరించారు. మనువాద, మతోన్మాద మూకల నుంచి భారత రాజ్యాంగ హక్కులను కాపాడుకోడం కోసం ప్రజాస్వామికవాదులు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దూలం శ్రీనివాస్, గుల్ల బాలాజీ, అబ్బోజు రమణ, రామగిరి రామస్వామి పాల్గొన్నారు.

అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

అలవెన్స్‌లపై ఆదాయ పనులను యాజమాన్యమే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డు మెంబర్ వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఆర్కే7 గనిలో ఫిట్ కార్యదర్శి సారయ్య అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల మూడవ తేదీన కోల్కతాలో జరిగిన జెబీసీసీఐ సమావేశంలో బొగ్గు గని కార్మికులకు పదకొండవ వేతన సవరణలో భాగంగా మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతం పెరిగిందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలు కూడా 15 శాతంకన్నా వేతన సవరణ జరగలేదని, అది కూడా 10 సంవత్సరాల కాలపరితి విధితో పదిహేను శాతం పెరుగుదల వచ్చిందని తెలిపారు. కానీ బొగ్గు గని కార్మికులకు మాత్రమే ఐదు సంవత్సరాల కాల పరిమితితో 19 శాతం పెరుగుదల సాధించినరని తెలిపారు. బొగ్గు గనుల జాతీయ కార్మిక సంఘాలు ఐక్యతతో విజయం సాధిస్తే సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ అవగాహన రాహిత్యంతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. 2017 ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ కార్మికులను ఆదాయ పనులు లేకుండా చేస్తామని మాట తప్పారన్నారు. అంతేకాకుండా కనీసం కోలిండియా కార్మికుల వలె సింగరేణిలో అధికారుల లాగా అలవెన్సుపై ఆదాయ పన్నును యాజమాన్యం చెల్లించేటట్లు నిర్ణయం తీసుకొని తమ చిత్తశుద్ధిని చాటాలన్నారు. టీబీజీకేస్ నాయకులు అవతల ప్రచారాలు మానే కార్మికులకు జరుగుతున్న ఆర్థిక దోపిడీని నివారించటానికి అలవెన్స్‌లపై ఆదేపన్ను యాజమాన్యం చెల్లించేటట్లుగా ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ఏఐటీయూసీ నాయకులు రవీందర్ రెడ్డి, మల్లేష్, మైనింగ్ స్టాఫ్ నాయకులు రాజేందర్ పాల్గొన్నారు.

నేతకాని హక్కుల సాధనకై ఉద్యమిద్దాం

నవతెలంగాణ-జన్నారం

నేతకాని మహర్ కులస్థుల హక్కుల సాధనకై ఉద్యమిద్దామని నేతకాని కుల హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో "నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉండి పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. రామగుండంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి నేతకానిలు అధిక సంఖ్యలో హాజరవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కామెరా ప్రేమ్ సాగర్, మండల నేతకాని సంఘం అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, నాయకులు రత్నం మాణిక్యం సాగర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్

రక్షణ సూత్రాలు పాటించి ముందుకు వెళ్లాలని సేఫ్టీ జనరల్ మేనేజర్ కార్పొరేట్ గురవయ్య అన్నారు. మంగళవారం సేఫ్టీ జనరల్ మేనేజర్ బెల్లంపల్లి రీజియన్ జాన్ ఆనంద్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డితో కలిసి ఎస్ఆర్పి1 గనిని సందర్శించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్లు గనిలో పని స్థలాలకు సంబంధించిన ప్లాన్లను పరిశీలించారు. గనిలోని 3 సీం 3ఎస్11 డిస్ట్రిక్ట్ లో స్టవ్వింగ్ ప్రదేశాలను పరిశీలించి గనిలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఎల్లవేళలా రక్షణపై అవగాహన కలిగి ఉండి, రక్షణ సూత్రాలను పాటిస్తూ, సేఫ్టీ మేనేజ్మెంట్ ప్రొసీజర్స్‌ను అనుసరిస్తూ ఉండాలని సూచించారు. అలాగే సూపర్వైజర్లు సూచించిన విధంగా పనులు చేయాలని పేర్కొన్నారు. గనులలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి రక్షణే ప్రథమం, రక్షణే ఎల్లప్పుడు, నా భద్రత నా బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. ఉద్యోగుల రక్షణకు సంస్థ ఎల్లవేళలా రక్షణ పరికరాలను అందిస్తుందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత ధ్యేయంగా ముందుకు వెళ్లాలన్నారు. ప్రమాదరహిత శ్రీరాంపూర్ ఏరియాగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఏరియా రక్షణాధికారి గోషిక మల్లేష్, గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, సేఫ్టీ డీజీఎం రామనాథం, గని మేనేజర్ విజయ్ కుమార్, గని రక్షణాధికారి బి.రాజేష్ బాబు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు ఆధార్‌కాపీలు అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మంగళవారం ఖైరిగూడ ఓసీపీ జనరల్ మజ్దూర్(హెచ్ఈఎంఎం) ప్రమోషన్ ఆధార్ కాపీలను ఉద్యోగులు మంగళవారం ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీకి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఇంజనీర్ మాట్లాడుతూ ప్రతి ఒక ఉద్యోగి తమకు కేటాయించిన విధులను అంకితభావంతో పనిచేస్తూ రక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, ఎస్ఈ నరేష్, ఫిట్ కార్యదర్శి కె.వెంకటేశం, జీఎం ట్రక్చర్ కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు, గజెల్లి చంద్రశేఖర్, సంక్షేమ అధికారి వేణు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయించుకోవద్దు

నవతెలంగాణ-దహెగాం

బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆపరేషన్ స్మైల్ ఎస్సై మృత్యుంజయ సర్కార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో వారసంతలో దుకాణ సముదాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లలోపు వారు చదువుకోవాలని, ఎవరు కూడా అలాంటి వారిని పనిలో పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అమీర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 18. 19. 30 తేదిల్లో సీఐటీయూ 17వ ఆల్ ఇండియా మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా జెండాను మంగళవారం మండల నాయకురాలు విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా నాయకులు దాగం రాజారాం మాట్లాడుతూ కార్మిక కర్షకుల హక్కుల కోసం సీఐటీయూ అలుపెరుగని కృషి చేస్తుందని తెలిపారు. హక్కులు అడిగితే రావని పోరాడితే వస్తాయన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ భూస్వాముల పాలనను పోషిస్తున్నాయని వాటిని అంతం మొందించే వరకు సీఐటీయూ పోరాటాలు చేస్తుందన్నారు. పోరాటాల రూపకల్పంలో భాగంగా సీఐటీయూ 17వ ఆల్ ఇండియా మహాసభలను బెంగళూరులో నిర్వహిస్తుందని తెలిపారు కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు బుర్సా గణపతి విజయ్ కుమార్, భాగ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు లీలారాణి. సుజాత, దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థుల జీవితాలతో చలగాటం సరికాదు

- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు
- డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం



నవతెలంగాణ-రెబ్బెన

ఎస్సై, కానిస్టేబుళ్ల నియామకంలో సమస్యలను పరిష్కరించాలని ఛలో ప్రగతిభవన్ ముట్టడికి వెళ్లిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను, అభ్యర్థులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు అరెస్టులను ఖండిస్తూ మండలకేంద్రంలో ప్లాకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయకుండా పోలీసుల నియామకాలను తప్పుడు తడకగా నిర్వహించి అభ్యర్థుల జీవితాలతో చలగాటమాడటం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో కొనసాగించి కోర్టు తీర్పును అమలుచేయాలని వారు కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల నాయకులు చల్లూరి మహేష్ పాల్గొన్నారు.

18న కంటివెలుగును జయప్రదం చేయండి

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని దాన్ని గ్రామాల్లో ప్రజలు విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీడీఓ అరుణ రాణి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు ఇతర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 18వ తేదీన ప్రతి గ్రామంలో నిర్వహించే కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కోఆప్షన సభ్యులు మున్వర్‌అలీ పాల్గొన్నారు.

జూన్‌లోగా ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని బాబాపూర్ శివారులో నిర్మిస్తున్న 340 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను జూన్ మాసాంతంలోగా పూర్తిచేసే విధంగా సంబంధిత అధికారులు, గుత్తేదారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.39.65కోట్ల రూపాయల వ్యయంతో 340 పడకల మూడు అంతస్తుల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, ఈ మేరకు పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలో వైద్య కళాశాల అనుమతి మంజూరైన వెంటనే ఈ ఆసుపత్రి ఆవరణలో నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామపంచాయతీలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ భారతి హెోలీ కెరీ పరిశీలించారు.మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా కల్మలపేట పాఠశాల ప్రహరీ గోడ పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.నీల్వాయి ప్రాథమిక పాఠశాల మరియు ఎస్టీ కాలనీ పాఠశాలలను సందర్శించి పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా బృహత్ పల్లె ప్రకృతి వనం పనులను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులను వేగవంతం చేయాలని నీల్వాయి సర్పంచ్ గాలి మధుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపు రావు, ఏపీవో సత్య ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మహేందర్, శంకర్, సాంకేతిక సహాయకులు కృష్ణ మోహన్, క్షేత్ర సహాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలో చాయిస్ ప్రశ్నలు పెంచాలి

- జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి



నవతెలంగాణ- నస్పూర్

రాష్ట్రంలో పదవ పరీక్షలలో మొదటిసారిగా పబ్లిక్ పరిక్షలు రాస్తున్న విద్యార్థులను మానసిక ఒత్తిడికి దూరం చేసే విధంగా పదవ తరగతి ప్రశ్నాపత్రంలో 30 శాతం చాయిస్ ప్రశ్నలుపెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇన్చార్జి విద్యాశాఖాధికారి సఫ్దార్ అలీఖాన్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రానున్న పదవ తరగతి పరీక్షల్లో పేపర్లను కుదించి 6 పేపర్లు చేయడం ఆహ్వానించదగ్గ విషయం కానీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 2 మార్కుల 3 మార్కుల ప్రశ్నలకు ఏలాంటి ఛాయిస్ ఇవ్వలేదని వ్యాసరూప ప్రశ్నలు కూడా ఇచ్చిన సమయంలో అన్ని రాయాలని పెట్టారని తెలిపారు.ఈ పద్ధతి వల్లన సిలబస్ మొత్తం ఒకే పేపర్ లో విద్యార్థులు రాయడానికి సమయం సరిపోదని, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కాకుండా రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కౌన్సెలింగ్ చేస్తామని చెప్పినా కూడా విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని, గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి అనుభవం ఎదురైనందున తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఛాయిస్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో మంగళవారం నవతెలంగాణ 2023 నూతన క్యాలెండర్‌ను సర్పంచ్ బండె తుకారాం ఆవిష్కరించారు. బడుగు బలహీన వర్గాల కోసం నవతెలంగాణ పత్రిక ఎంతగానో కృషి చేస్తుందన్నారు. క్యాలెండర్‌ను నాణ్యతగా రూపొందించడం ఒక నవతెలంగాణకే చెల్లితుందన్నారు. ప్రజలకు వారధిగా పత్రికను నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి విలేకరి జయంత్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఛేదిద్దాం.. వంద శాతం పూర్తి చేద్దాం..!

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు లక్ష్యాన్ని ఛేదించి వంద శాతం పూర్తికి కృషి చేద్దామని మండల పరిషత్ అధ్యక్షురాలు గోదరి రమాదేవి లక్ష్మన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహణ సదస్సులో జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. మండల పరిధిలో గ్రామాల వారిగా 18 సంవత్సరాలు పైబడి దృష్టిలోపం ఉన్నవారికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు చేయించడంలో ప్రభుత్వ అధికారులకు ప్రజాప్రతినిదులు సహాయ సహకారం అందించాలని కోరారు. మండల కేంద్రంతో పాటు కుందారంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా అందుబాటులో ఉన్నటువంటి కేంద్రంలో కంటి పరిక్షలు చేయించుకోవడం కోసం గ్రామీణులు హాజరు కావల్సి ఉంటుందన్నారు. జనవరి 18 నుండి 80 రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని దృష్టి లోపం ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, ఎంపీఓ అనిల్ కుమార్, ఈజీఎస్ ఏపీఓ బాలయ్య, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల వసతుల కల్పనకు భూమిపూజ



నవతెలంగాణ-నార్నూర్

మన ఊరు మన బడి కింద లోకారి(కె) గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల వివిధ నిర్మాణ పనులకు మంగళవారం సర్పంచ్ మెస్రం దేవ్‌రావ్ భూమిపూజ చేశారు. పాఠశాల ప్రహరీ గోడ, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.73.75 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులకు మంజూరైన నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో డీఈ శివ ప్రసాద్, ఐటీడీఏ ఏఈ సునీల్, ఎంఈఓ ఆశన్న, గ్రామ పటేల్, భీంరావ్, నాయకులు మెస్రం శేఖర్, లింగు, ఆత్రం కిషన్, మారుతి, నోడల్ ఆఫీసర్ న్యానేశ్వర్ ఉన్నారు.

ఉన్నత జీవితానికి చదువే మార్గం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మనిషి ఉన్నతంగా జీవించి సమాజంలో పేరు ప్రఖ్యాతలు పొందాలంటే చదువు ఒకటే ఉత్తమ మార్గమని హైదరాబాద్‌కు చెందిన యాద శంకర్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మెన్ సంగిశెట్టి బాబు అన్నారు. మంగళవారం మండలంలోని దేగామ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్ ఫైల్స్, క్యాష్ అవార్డులను అందజేశారు. గతంలో కూడా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, డిక్షనరీలను, ఇతర పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లి దండ్రుల పేరుమీద యాద శంకర్ ఫౌండేషన్ స్థాపించి, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రతీ సంవత్సరం విద్యార్థులకు ఏదో ఒక ఉపకరణాన్ని బహుకరిస్తు వస్తున్నారని, విద్యాభివృద్ధికి వారు చేసే సేవలు ఉత్తమమైనవని కొనియాడారు. అలాగే ఫౌండేషన్ సభ్యులకు పాఠశాల చైర్మెన్ నాయిడి మహేష్, హెచ్ఎం శ్రీకాంత్ నాయకులు నాణం రమణలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వొకేట్ జీవన్ కుమార్, వక్ఫ్ బోర్డ్ మెంబర్ సమీర్, టీయూటీఎఫ్ అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు భూమన్న, గంగయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



సీఐటీయూ సంఘం ఎల్లప్పుడు కార్మికులకు అండగా నిలుస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెంగళూరులో ఈనెల 18 నుండి 22 వరకు 17వ జాతీయ మహాసభలు జరుగనున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 42 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా అమలు పరచడానికి సన్నాహాలు చేస్తుందన్నారు. అదే జరిగితే రాబోయే కాలంలో కార్మికులు సంఘ నిర్మాణం కోసం చేసే సమ్మె హక్కు కోల్పోవడం జరుగుతుందన్నారు. ఆయా రంగాల్లో కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోయే దుస్థితి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచానికి కార్మిక సమస్యలను తెలియజేయడానికే జాతీయ మహాసభలు ఏర్పాటు చేశారని అన్నారు. ఆ సభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కార్మికుల హక్కుల కోసం కార్యచరణ రూపొందించాలని కోరుతూ జెండా ఆవిష్కరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల ఉసురు పోసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మికుల అన్ని సమస్యలు 17వ ఆల్ ఇండియా కౌన్సిల్లో చర్చించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, ఎం.గంగన్న, నాయకులు నరేష్, ఆశన్న, ఉమా ప్రసాద్, కిరణ్, రామన్న, తిరుపతి, రాకేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర రంగంలో రాణించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర రంగంలో రాణించాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు మంగళవారం స్థానిక కేబీ ప్రాంగణంలో గిరిజన 50వ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే రేఖ నాయక్, ఆదిలాబాద్ జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్ధన్, మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ కనక లక్కేరావు, ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే రేఖ నాయక్‌తో వారికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర మేళలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ఆలోచనలకు పదును పెడితే ఎలాంటి ప్రయేగాలైన చేస్తారని అన్నారు. కాని మెదస్సుకు పని చెప్పాలని తెలియజేశారు. గొప్ప గొప్ప శాత్రవేత్తలు చిన్న చిన్న ప్రయోగాలు చేసిన వారేనని గుర్తు చేశారు. గిరిజన విద్యార్థులు సైతం గొప్ప గొప్ప శాత్రవేత్తలుగా ఎదిగేందుకు ఈ స్థాయి నుంచే ఉపాధ్యాయులు తగు కృషి చేయాలని అన్నారు. గిరిజన విద్యార్థులు దేనిలో తక్కువ కాకుండా నిరూపించుకోవాలని అన్నారు. గిరి విద్యార్థుల సృజనాత్మకతను గుర్తించేందుకు ఇలాంటి మేళాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడతలో నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఇలాంటి విజ్ఞాన శాస్త్ర మేళలో ముందు వరుసలో ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థికి కసి, పట్టుదల, లక్ష్యంతో ఉండి చదువులో రాణించడంతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గిరిజన విద్య, వైద్యం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. పీఓ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గిరిజన విజ్ఞాన శాస్త్ర మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరి విద్యార్థుల మేథస్సును పెంపొందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రోత్సాహించేందుకే ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. గిరి విద్యార్థులు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. మేళాలో పాల్గొనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. మేళాలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులకు ఐటీడీఏ అధికారులు శాలువాతో సన్మానించి, జ్ఞాపకాలను అందించారు. అక్కడ విద్యార్థులు ఏర్పాటు చేసిన మేళా స్టాల్‌లను ప్రారంభించి పరిశీలించారు. పలువురు గిరిజన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టీజీఓ అధ్యక్షుడు అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ ఎంపీ గోడం నగేష్, ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్, ఉట్నూర్ ఏఎస్పీ హర్షవర్ధన్, మంచిర్యాల జిల్లా ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఐటీడీఏ డీడీ దిలీప్, ఏటూరు నాగారం ఐటీడీఏ ఏపీఓ జనరల్ వసంత్ రావ్, ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటివెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

గ్రామస్థాయిలో ఈనెల 12లోగా గ్రామసభలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో కంటి వెలుగు, ఫించన్లు, హరితహారం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, తదితర అంశాలపై సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, మారుమూల గ్రామాలలోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించాలని, రవాణా, తదితర ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గ్రామస్థాయిలో రాయి సెంటర్ పెద్దలు, సార్మెడీలు, పటేల్‌లను ఆహ్వానించి కార్యక్రమంపై వివరించాలని తెలిపారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేసి విస్తృత ప్రచారం నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు. ఆసరా ఫించన్‌దారు మరణిస్తే అతని భార్యకు ఫించను వచ్చే విధంగా 15 రోజులలో ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. హరితహారం కార్యక్రమం కింద నాటిన మొక్కలలో చనిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటి సంరక్షించాలని, ట్రీగార్డ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. వాటరింగ్ నిర్వహించాలని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, జెడ్పీ సీఈఓ గణపతి, డీఆర్డీఓ కిషన్, డీపీఓ శ్రీనివాస్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం కళాశాల హిందీ ఉపాధ్యాయుడు మొహమ్మద్ అబ్దుల్ హమీద్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందీ భాషలో ఉన్నత చదువులు చదివిన వారికి జాతీయ స్థాయిలో ఉత్తమ అవకాశాలను పొందవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు రజిత, నాగరాజు, రవీందర్, ప్రశాంత్, నరహరి, మోహన్, శ్రీనివాస్, రమేష్, సత్యవతి, దేశ స్వరూప, రాజు, మంజూర్ పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

నవతెలంగాణ - వాంకిడి

ఎస్ఐ, కానిస్టేబుళ్ల సమస్యలను పరిష్కరించాలని ఛలో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమంలో అభ్యర్థులను అరెస్టు చేయడం సిగ్గుచేటని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నితిన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అరెస్టులను ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ అభ్యర్థులపై పోలీసులు జులుం ప్రదర్శించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయకుండా పోలీసులు వివరాలను తప్పుడు తడకగా నిర్వహించి అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాత పద్ధతిని కొనసాగించాలని, కోర్టు తీర్పును అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు తిరుపతి, వడ్లూరి శ్రీకాంత్, జాడి దిలీప్, అబి పాల్గొన్నారు.

సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



నవతెలంగాణ-ఖానాపూర్

కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ సమస్యలను పట్టించుకోవడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ఈనెల 18వ తేదీన జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేజీబీవీ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు 2016లో సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని తీర్పులిచ్చిన అమలు చేయడం లేదని అన్నారు. పర్మినెంట్ కార్మికులకు 40, 50 వేల వేతనాలు ఉంటే కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ వేతనాలు మాత్రం అతి తక్కువగా ఉన్నాయని పదివేలలోపు మాత్రమే ఉన్నాయని అన్నారు. వీటిని పెంచాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందని ఆయన డిమాండ్ చేశారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఐదు గంటల నుండి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, అమలు కావడం లేదని, ప్రస్తుతం పొందుతున్న వేతనాలు ఏమాత్రం సరిపోవటం లేదని కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. కేజీబీవీలో యూఆర్ఎస్ఎల్‌లో పనిచేస్తున్న వారందరినీ సీఎం ప్రకటనకు అనుగుణంగా రెగ్యూలరైజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు రూప, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి. అనిత, లక్ష్మి అల్లావల్లి నర్సవ్వ, సరిత, స్వప్న, మాయ, రజిత పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చట్టం నిబంధనల ప్రకారం మినహాయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఆదాయ పన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగి నుండి ఆదాయ పన్ను వేతనంలో నుండి మినహాయించాలని ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ పి.కృష్ణ కుమార్ అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో పన్ను వసూళ్ల, మినహాయింపులపై వివిధ శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ పన్ను చట్టం-1961 ప్రకారంగా డీడీఓలు వారి పరిధిలోని ఉద్యోగుల వేతనాల నుండి చట్ట ప్రకారం పన్ను మినహాయింపులు నిర్వహించాలని అన్నారు. ఉద్యోగుల వేతనాల నుండి పన్నుల మినహాయింపులో తక్కువ వసూలు చేయకూడదని, మినహాయించిన పన్నులను ప్రభుత్వానికి వివరాలు సమర్పించాలని అన్నారు. అట్టివి డీడీఓలే నిర్వహించాలని తెలిపారు. వివిధ డీడీఓలు, ఉద్యోగులు లేవనెత్తిన ఇంటి అద్దె, వివిధ బిల్లుల ఏరియార్స్ వంటి అంశాలపై ఉన్న సమస్యలను నివృత్తి చేసుకున్నారు. ప్రతి ఉద్యోగి ఆదాయ పన్నుకు సంబంధించిన వివరాలను బాధ్యతగా అందజేయాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారి ఏ.మధుసూదన్‌రావు, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఇన్‌చార్జి డీడీ రమేష్ జాదవ్, నిర్మల్ ఏటీఓ గంగాధరయ్య, ఖజానా శాఖ అధికారులు, సిబ్బంది, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీఓ నిలదీసిన సర్పంచులు



నవతెలంగాణ- తాండూర్

ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా తాండూర్ ఎంపీఓ పంచాయతీ నిధులను డ్రా చేయడం పట్ల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు అస్న రమేష్ సర్పంచులతో కలిసి మంగళవారం నిలదీశారు. తమ ప్రమేయం లేకుండా తాండూర్ ఎంపీఓ విద్యుత్ బిల్లులు, మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు ట్రాక్టర్ కిస్తీలను నేరుగా పంచాయతీ నిధుల నుండి డ్రా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం తమ సొంత డబ్బులను ఖర్చు చేసి అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని వారు తెలిపారు .ప్రభుత్వం నిధులను విడుదల చేసిన సందర్భంలో సర్పంచుల ప్రమేయం లేకుండా పంచాయితీ నిధులను డ్రా చేయడం ఎంతవరకు సమంజసం మని వారు ప్రశ్నించారు. రాజీవ్‌నగర్ సర్పంచ్ క్రిస్టోఫర్, చౌటపల్లి సర్పంచ్ చీమల శంకర్, గోపాల్‌నగర్ సర్పంచ బతుకమ్మ తదితరులున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - వాంకిడి

ఆర్ఎంపీ, పీఎంపీ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కొమురం భీం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మారజ్ హుస్సేన్ తెలిపారు. గౌరవఅధ్యక్షుడిగా అక్తర్‌హుస్సేన్, అధ్యక్షుడిగా వినోద్, ఉపాధ్యక్షులుగా చునార్కర్ విజయ్, గుర్నులే పోచాలు, ప్రధాన కార్యదర్శిగా సిద్దం రాజు, కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా రవీందర్, జిల్లా కోఆర్డినేటర్‌గా అశోక్‌కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఆసిఫ్ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కంటి వెలుగు నిర్వహణపై అవగాహన



నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై ప్రజా ప్రతినిధులకు అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ నుంచి కాజీపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు బృందాలుగా షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధికారులు వివరించారు. 65 రోజులపాటు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ అలీం, జడ్పిటిసి పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ లు కొండబత్తుల రాంచందర్, అక్కేపల్లి లక్ష్మీ, చంద్రమౌళి, వైద్య అధికారులు రవికిరణ్, ప్రతాప్, ఎంపీవో నాగరాజు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శం



నవతెలంగాణ-ఉట్నూర్

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలోని ప్రవేశపెట్టిన పథకాలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకు జాతీయ పార్టీ పెట్టారని అన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఆదరణ చూపెట్టారో అదే విధంగా దేశ ప్రజలు ఆదరణ చేపట్టాలని ఆకాక్షించారు. ప్రతి ఇంటికి కేసీఆర్ పెద్ద కొడుకుగా ఉంటారని అన్నారు. అనంతరం లబ్దిదారులకు చెక్కులు అందించడంతో పాటుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. లక్కారంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్, ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, నాయకులు, అధికారులు ఉన్నారు.